క్లుప్తంగా

జగనన్న కాలనీకి విద్యుత్ వెలుగులు



టి.నర్సాపురం మండలం మధ్యాహ్నపువారి గూడెం (బొర్రంపాలెం) జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లు

ఏలూరు (టూటౌన్) : జగనన్న హౌసింగ్ కాలనీకి విద్యుత్ వెలుగులు వచ్చినట్లు ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ సాల్మన్ రాజు తెలిపారు. జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు టి.నర్సాపురం మండలం మధ్యాహ్నపువారి గూడెం (బొర్రంపాలెం) జగనన్న హౌసింగ్ లేఅవుట్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి ఆదివారం విద్యుత్ సరఫరా చేసినట్లు ఆయన చెప్పారు.

మద్యం అక్రమ విక్రయాలకు పాల్పడితే చర్యలు



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను చూపుతున్న ఏలూరు రూరల్ ఎస్సై రాజారెడ్డి

ఏలూరు టౌన్: మద్యం అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడితే సహించేది లేదని, కఠిన చర్యలు తప్పవని ఏలూరు రూరల్ ఎస్సై రాజారెడ్డి హెచ్చరించారు. ఏలూరు వన్‌టౌన్ సీఐ ఎన్.రాజశేఖర్‌కు అందిన సమాచారం మేరకు ఏలూరు రూరల్ పోణంగి గ్రామంలో ఒక బడ్డీ కొట్టులో మద్యం అక్రమంగా విక్రయిస్తుండగా పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. 29 గోల్డెన్ పీర్ 180 ఎంఎల్ లిక్కర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పూడి పద్మ అనే మహిళను అరెస్ట్ చేసి, మద్యం సరఫరా చేస్తున్న సూరిబాబు అనే వ్యక్తిపై కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజారెడ్డి తెలిపారు.

రామకోటి ప్రాంగణంలో నేత్ర వైద్య శిబిరం



పరీక్ష చేస్తున్న వైద్యుడు

ఏలూరు (టూటౌన్): స్థానిక ఒకటో పట్టణంలోని రామకోటి ప్రాంగణంలో డాక్టర్ మునగా రామమోహన్‌రావు కళావేదికపై ఎంజేఎఫ్ లయన్ మానేపల్లి రామారావు ఆధ్వర్యాన ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. పరమంస యోగానంద నేత్ర వైద్యశాల వేమగిరి ఆస్పత్రి వైద్య సిబ్బంది శిబిరంలో 153 మందికి పరీక్షలు చేశారు. వీరిలో 15 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించి ఆస్పత్రికి తీసుకెళ్లారు. మరో 32 మందికి కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. ఉషా సంస్థల అధినేత వీవీ బాలకృష్ణారావు సహకారంతో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో పండరీనాథ్, చెన్నా వెంకట రామయ్య, బొరౌట్టి సురేష్ కుమార్, ఎం.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే మహిళా సాధికారత

- ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్లనాని
- 6వ డివిజన్ మాదేపల్లి కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం
- రూ.1.50 కోట్లతో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



ఏలూరు మాదేపల్లి కాలనీలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ఆళ్లనాని, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, మేయర్ నూర్జహాన్

ఏలూరు టౌన్ : రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే మహిళా సాధికారత సాధ్యమని, మహిళలను ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో అగ్రగణ్యులుగా నిలిపేందుకు సీఎం జగనన్న చేస్తున్న ప్రతి కార్యక్రమానికి మహిళా లోకం అండగా ఉండాలని ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్లనాని కోరారు. ఏలూరు నగరంలో 115వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం స్థానిక 6వ డివిజన్‌లో చేపట్టారు. డివిజన్ కార్పొరేటర్ సుంకర చంద్రశేఖర్ ఆధ్వర్యాన ఎమ్మెల్యే నానికి అపూర్వ స్వాగతం పలికారు. శ్రీదేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని తొలుత ఎమ్మెల్యే నాని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. మాదేపల్లి కాలనీ ప్రాంతంలో ప్రజలు, అభిమానులు భారీఎత్తున హాజరై పూలవర్షం కురిపించారు. మహిళలు హారతులిస్తూ ఘన స్వాగతం పలికారు.

బీటీ రోడ్డుకు శంకుస్థాపన

మాదేపల్లిలోని ఇందిరమ్మ కాలనీలో ప్రజలు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్యకు పరిష్కారం చూపుతూ భారీగా రూ.1.50 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి ఏలూరు ఎమ్మెల్యే ఆళ్లనాని, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, నగర మేయర్ షేక్ నూర్జహాన్ శంకుస్థాపన చేశారు. తమ సమస్యను తెలుసుకుని రోడ్డు నిర్మాణానికి నిధుల మంజూరుపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆళ్లనాని మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మీరంతా అండగా ఉండాలన్నారు. విద్య, ఉపాధిలో 33 శాతం, రాజకీయ రంగంలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్న ఘనత మన ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. 2019 ఎన్నికల్లో సీఎం జగనన్న ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా రుణమాఫీ చేశామని, సున్నా వడ్డీ సొమ్ము క్యాలెండర్ ప్రకారం నేరుగా బ్యాంకు ఖాతాల్లోకే జమ చేస్తున్నామని తెలిపారు. మహిళల రక్షణకు దిశ యాప్, దిశ పోలీస్ స్టేషన్లు, సత్వర న్యాయానికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాటుతో మహిళల్లో భరోసా ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, వైస్ చైర్మన్ కంచన రామకృష్ణ, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎంఆర్ పెదబాబు, జిల్లా కోశాధికారి మంచెం మైబాబు, నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యులు, కార్పొరేటర్లు, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, తహసీల్దార్ సోమశేఖర్, నగర పాలక సంస్థ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

శనివారపుపేట సహకార సంఘం చైర్మన్‌గా రంగబాబు



రంగబాబుకు అభినందనలు తెలుపుతున్న కాపు నాయకులు

ఏలూరు రూరల్: శనివారపుపేట సహకార సంఘం త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా కంది రంగబాబును ప్రభుత్వం నియమించింది. ఆయనతో పాటు పల్లపోతు లీలాప్రసాద్, కొండే జ్ఞానేషు సభ్యులుగా కొనసాగనున్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు సంఘ సమావేశ మందిరంలో రంగబాబు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కార్యక్రమానికి ఏలూరు ఎమ్మెల్యే ఆళ్లనాని ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని సంఘ సీఈఓ ఆర్‌వీ శ్రీనివాసులు చెప్పారు. ఆదివారం కాపు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పులి శ్రీరాములు, ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు వాసా రాజు, జిల్లా జాయింట్ సెక్రటరీ కొప్పిసెట్టి వేణుగోపాల్‌తో పాటు పలువురు కాపు నాయకులు రంగబాబును కలిసి అభినందనలు తెలిపారు. కాపులకు సముచిత స్థానం కల్పిస్తున్న ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం



ఏలూరు పత్తేబాదలోని కనకదుర్గ ఆలయంలో శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి అవతారంలో అమ్మవారు



ఏలూరు పవర్‌పేటలోని వాసు దేవాలయంలో ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన రాజ్యలక్ష్మి అమ్మవారు

ఏలూరు (టూటౌన్): నగరంలో శ్రీదేవీ నవరాత్రి మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను పురస్కరించుకుని పలు అమ్మవార్ల ఆలయాలు సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకున్నాయి. ఆలయ కమిటీల ప్రతినిధులు, దేవాదాయ శాఖ అధికారులు ఆలయాలకు కొత్తగా రంగులు వేయించి ప్రాంగణాల్లో చలువ పందిళ్ళు ఏర్పాటు చేశారు. విద్యుత్ అలంకరణలు ఆలయాలకు మరింత శోభను తీసుకొచ్చాయి. భక్తులు అమ్మవార్లను దర్శించుకునే సమయంలో వారికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి పర్వదినం సందర్భంగా ఈనెల 15వ తేదీ ఆదివారం ప్రారంభమైన నవరాత్రి ఉత్సవాలు ఈనెల 23వ తేదీ వరకు అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రతినిత్యం క్షీరాభిషేకాలు, శ్రీచక్ర అర్చనలు, కుంకుమార్చనలు, శ్రీ లలితా సహస్రనామ పారాయణం నిర్వహించనున్నారు. అలాగే నవరాత్రుల సందర్భంగా అమ్మవార్లకు రోజుకో ప్రత్యేక అలంకరణ చేయనున్నారు. భక్తుల గోత్రనామాలతో విశేష పూజలు, నీరాజన మంత్రపుష్పాలు, తీర్థ ప్రసాద వినియోగ సేవలు నిర్వహించనున్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆయా ఆలయాల్లో శమీ పూజలు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవార్లను మొదటి రోజు శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించారు. స్థానిక పవర్‌పేటలోని శ్రీ కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానం, పవర్‌పేట వాసు దేవాలయం ప్రాంగణంలోని శ్రీ రాజ్యలక్ష్మీదేవి దేవస్థానం, రామచంద్రరావు పేట శ్రీమత్ మార్కండేయ వేదపాఠశాల, పత్తేబాద శ్రీ కనకదుర్గ ఆలయం, 12 పంపుల సెంటర్ శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయం, సత్రంపాడు శ్రీ సౌభాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం, పవర్‌పేట శ్రీ సంస్కృత పాఠశాల, దక్షిణపు వీధిలోని శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి తదితర ఆలయాల్లో దేవీ నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి.

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు

- పేదలకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి



కొమిరేపల్లిలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు మేయర్ షేక్ నూర్జహాన్

దెందులూరు: ప్రతి గడపకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఈ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్లనాని, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, జెడ్పీచైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్, ఏలూరు మేయర్ షేక్ నూర్జహాన్ అన్నారు. ఆదివారం కొమిరేపల్లిలో రూ. 80లక్షలతో నిర్మించనున్న రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి శంకుస్థాపన చేశారు. దెందులూరు నియోజకవర్గంలో గడపగడపకు 200 రోజులు పూర్తయిన సందర్భంగా వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్, జెడ్పీటీసీ నిట్టాలీలానవకాంతం, ఎంపీపీలు బొమ్మనబోయిన సుమలత, బత్తుల రత్నకుమారి, ఎంపీటీసీ పులవర్తి వరమణి, పార్టీ జిల్లా కార్యదర్శి సంతోష్, సర్పంచ్ పరసా లక్ష్మి సుజాత కనకరాజు, పార్టీ అధ్యక్షుడు కోటిపల్లి సురేష్, సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి) ఆధ్వర్యంలో వందలాది మంది నాయకులు, కార్యకర్తల సమక్షంలో భారీ కేక్‌ను ఎమ్మెల్యే కట్ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సమావేశంలో ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు తీరును పరిశీలించేందుకు, ప్రజల సమస్యలు ప్రజాప్రతినిధులు ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారని అన్నారు.

నెరవేరిన కొమిరేపల్లి వాసుల కల

ఎనిమిది దశాబ్దాలుగా జాతీయ రహదారి నుంచి కొమిరేపల్లికి రోడ్డు లేక ప్రయాణానికి వందలాది మంది ప్రజలు, విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. గతంలో పల్లె నిద్ర చేసినప్పుడు తన తండ్రి కొఠారు రామచంద్రరావు కొమిరేపల్లి గ్రామానికి రోడ్డు నిర్మిస్తామని ఇచ్చిన హామీ ముఖ్యమంత్రి జగన్ సహకారంతో సాకారమైందన్నారు.

ఉత్సాహంగా గడప గడపకు మన ప్రభుత్వం

ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీటీసీ పులవర్తి వరమణి, జిల్లా కార్యదర్శి పులవర్తి సంతోష్, సర్పంచ్ పరసా లక్ష్మీ సుజాత కనకరాజు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కోటిపల్లి సురేష్, సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి), మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని పాల్గొన్నారు. ఇంటింటా సమస్యలు అడిగి తెలుసుకుని నమోదు చేసుకున్నారు. నాలుగన్నరేళ్లల్లో చేసిన అభివృద్ధిని, పథకాల ద్వారా కుటుంబాలు పొందిన లబ్ధిని ఎమ్మెల్యే వివరించారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ప్రజలు మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు ఆళ్ల సతీష్ చౌదరి, పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, ఏలూరు రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు తేరా ఆనంద్, ముంగర సంజీవ్, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, వలంటీర్లు, గృహసారథులు ఉన్నారు.

ఆయిల్‌పామ్ రవాణాకు కొత్త టెండర్లు పిలవాలి

లింగపాలెం: ఆయిల్‌పామ్ గెలలను ఫ్యాక్టరీకి చేరవేసేందుకు రవాణాకుగాను వెంటనే కొత్త టెండర్లు పిలవాలని రైతులు, వేబ్రిడ్జి యజమానులు కోరారు. దీనిపై వారు ఆదివారం ధర్మాజీగూడెంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పెదవేగి పామాయిల్ ఫ్యాక్టరీ వారు టెండర్ పిలిచి పాడిన వ్యక్తి ద్వారా పంటను తోలటం జరుగుతుందని తెలిపారు. ఈ పామాయిల్ ఫ్యాక్టరీ పరిధిలో మూడు మండలాలకు చెందిన ఆయిల్‌పామ్ రైతులు ఏటా పంటను విక్రయిస్తున్నట్లు చెప్పారు. రెండేళ్లకు ఒకసారి ఈటెండర్లు పిలవాల్సి ఉందన్నారు. ప్రస్తుతం టెండర్ల గడువు ఈ నెలాఖరుతో ముగియనుండగా కాంట్రాక్టర్‌కు మళ్లీ గడువు పొడిగించారని రైతులు, యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత టెండర్లకు సంబంధించి ఫ్యాక్టరీవారు మూడు మండలాల్లో 10 పాయింట్లకుగాను ఒకే వ్యక్తికి గుత్తాధిపత్యంగా ఇవ్వటం జరిగిందన్నారు. ఈ టెండర్‌ను దూర ప్రాంతంలో ఉన్న ఓవ్యాపారవేత్త వారి అనుమాయులు పేర్ల మీద నిర్వహిస్తున్నారని, ఈ విషయాన్ని ఇటీవల ముడిచెర్లలో ఆయిల్‌పామ్ మొక్కల పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. దీనిపై ఆయన అధికారులను మందలించి ఇక మీదట అలా జరగకుండా చేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. టెండర్ల గడువు ముగుస్తుండటంతో లోపాయికారి ఒప్పందంతో ప్రస్తుత కాంట్రాక్టర్‌కే మళ్లీ గడువు పొడిగించడంచారని, ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి వెంటనే కొత్త టెండర్లు పిలవాలని రైతులు, వేబ్రిడ్జి యజమానులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



పెదవేగి గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థులు

ఏలూరు (టూటౌన్): పెదవేగిలోని ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 1988లో 10వ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఏలూరులోని అంబికా ఫ్లావర్స్ ఫంక్షన్ హాలు నందు ఆత్మీయ కలయిక నిర్వహించారు. తాము పాఠశాలలో చదివి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆనాటి గురువులను సత్కరించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి ప్రిన్సిపాల్ ఎంవీఎస్ఎస్‌కే సూర్యారావు, ఉపాధ్యాయులు ఆదినారాయణ, సత్యమూర్తి, పి.శ్రీనివాసరావును సన్మానించారు. పూర్వ విద్యార్థులతో పాటు వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ వసంతాటి శ్రీనివాస్, గెడ్డం కృష్ణ, గంగాధరరావు, ఛార్లెస్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఏలూరు టౌన్: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని, నేరగాళ్ళపై గట్టి నిఘా ఉంచామని ఏలూరు వన్‌టౌన్ సీఐ ఎన్.రాజశేఖర్ తెలిపారు. ఏలూరు రూరల్ ఎస్సై రాజారెడ్డి ఆధ్వర్యాన సిబ్బందితో కలిసి స్థానిక ద్వారకానగర్ 8వ రోడ్డులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఆదివారం రాత్రి దాడి చేశారు. అజీజ్ అనే వ్యక్తి ఇంట్లో పేకాటాడుతున్న 7గురిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. వీరి నుంచి రూ.24 వేలు నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై రాజారెడ్డి తెలిపారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి : రాట్నాలకుంటలోని రాట్నాలమ్మ ఆలయానికి ఆదివారం జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించారు. ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పాల్గొన్నారు. ఈ వారం అమ్మవారికి పూజా టికెట్ల ద్వారా రూ.19,970, విరాళాలు రూ.8,286, లడ్డూ ప్రసాదం విక్రయంతో రూ.18,485, ఫొటోల విక్రయం ద్వారా రూ.1,995, మొత్తం రూ.48,686 ఆదాయం లభించిందని దేవస్థాన చైర్మన్ వెంకటేశ్వరరావు చెప్పారు.

ప్రజల అవసరాలు తీర్చేందుకే సచివాలయాల ఏర్పాటు

ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



రావులపర్రులో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

ఉంగుటూరు: సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో గ్రామాల్లోని ప్రజలకు ప్రభుత్వ పాలన చేరువైందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. ఉంగుటూరు మండలం ఉప్పాకపాడు, బొమ్మిడి, కాగుపాడు, రావులపర్రులో ఒక్కో భవనం రూ.43.60 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాలను ఎమ్మెల్యే వాసుబాబు ఆదివారం ప్రారంభించారు. ఉప్పాకపాడులో రూ.23 లక్షల వ్యయంతో నిర్మించిన ఆర్‌బీకే భవనాన్ని, రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన జలజీవన్ మిషన్ మంచినీటి పైప్‌లైన్‌ను వాసుబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ గాంధీ కలలుకన్న గ్రామ స్వరాజ్యం సీఎం జగనన్న సాకారం చేశారని అన్నారు. గ్రామ ప్రజల అవసరాలకు అనుగుణంగా సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చారని వాసుబాబు వివరించారు. సచివాలయ విభాగంలోని పలు విభాగాలను జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి ఎంపీపీ ఘంటా శ్రీలక్ష్మి, మండల కన్వీనర్ మరడ మంగరావు ప్రారంభించారు. మరికొన్ని విభాగాలను సర్పంచులు, ఎంపీటీసీలు, స్థానిక గ్రామస్థాయి పార్టీ నాయకులు ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యురాలు మంద జయలక్ష్మి, సచివాలయ కన్వీనర్ పి.బాలకృష్ణ, సొసైటీ అధ్యక్షుడు పాపారావు బాబ్జి, ఎంపీటీసీ ఛాంబర్ అధ్యక్షుడు బండారు నాగరాజు, నాయకుడు బళ్ల త్రిమూర్తులు పాల్గొన్నారు. ఉప్పాకపాడులో సర్పంచి నేదూరి అబ్బులు, ఉప సర్పంచి వల్లీ, ఎంపీటీసీ మంగరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. కాగుపాడులో నాయకురాలు వంకిన భారతి, సర్పంచి వంకిన సుదీప్త చిట్టిబాబు, బొమ్మిడిలో సర్పంచి మద్దాల రాధారాణి (పెద్దింట్లు)త్రిమూర్తులు, ఎంపీటీసీ విద్యాభారతి, సొసైటీ అధ్యక్షుడు మేడవరపు మోహన్, నాయకుడు బాదరాల సుబ్రహమణ్యం, రావులపర్రులో సర్పంచి పైడి వెంకటరమణ, రంగరావు, నాయకుడు గాది వెంకటరమణ, మాజీ సర్పంచి ఎడ్లపల్లి చంటి పాల్గొన్నారు. అధికార్లు ఈవోపీఆర్డీ షంషుద్దీన్, తహసీల్దారు వెంకటరమణ, ఆయా పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నూర్ బాషా సంఘ జిల్లా కార్యదర్శిగా మస్తాన్

కొయ్యలగూడెం: నూర్ బాషా(దూదేకుల) ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా తనను నియమించినట్లు షేక్ మస్తాన్ వల్లి ఆదివారం పేర్కొన్నారు. రాజవరం గ్రామానికి చెందిన మస్తాన్ వల్లి వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ విభాగం నాయకులుగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర నూర్ బాషా మైనార్టీ సెల్ అధ్యక్షునిగా వ్యవహరిస్తున్న ఎస్ఎస్ బాజీ తనకు నియామక పత్రాన్ని అందజేశారని తెలిపారు. దూదేకుల సంఘ పటిష్టతకు, ప్రభుత్వం తరఫున సంఘ సభ్యులకు చేకూరే సంక్షేమ పథకాలను అందించడానికి కృషి చేస్తానని మస్తాన్ తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు, పార్టీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు మస్తాన్‌ని అభినందించారు.